యూపీహెచ్‌సీ తనిఖీ



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ను రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ వెంకటేశ్వర్‌రావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ కొత్త భవనంలోనే ఓపీ, ఫార్మసీ, ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాత భవనంలో కార్యాలయం, సమావేశాలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్‌ ఆఫీసర్‌ ఉమా దీపిక, డిప్యూటీ డెమో శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్‌ఎన్‌ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో మ్యాథ్స్‌ డే



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి

చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని వేముకుంట ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం మ్యాథ్స్‌ డేను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు. పేద విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్‌ పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భాస్కర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: అంజయ్యనగర్‌ పార్కును కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్‌ ఆర్డీఓ వెంకట్‌రెడ్డికి జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు. పార్కు స్థలంలో దొంగ పట్టాలు సృష్టించి కబ్జాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సారె సమర్పణ

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ శ్రీ వివేకానంద నగర్‌లోని దుర్గమ్మ, పోచమ్మ, నాగదేవత ఆలయం తరపున గురువారం శ్రీ గోదా రంగనాథస్వామి వారి కల్యాణానికి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్‌ పులిగొల్ల శ్రీనివాస్‌ యాదవ్‌, గణేశుల నాగేశ్వరరావు, వి.వెంకన్న, మహిళా భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలో దోమల నివారణలో భాగంగా గురువారం ఎంటమాలజీ సూపర్‌వైజర్‌ డి. నరసింహులు, సిబ్బందితో కలిసి పరికి చెరువులో ఎంఎల్‌ఓ ఆయిల్‌ బాల్స్‌ వేశారు. దీనివల్ల లార్వాలు చనిపోతాయన్నారు. అదే విధంగా హైదర్‌నగర్‌, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలో ఉన్న చెరువుల్లో, కుంటల్లో 15 రోజులకు ఒకసారి డ్రోన్‌తో స్ప్రే చేస్తున్నామన్నారు.

ముగ్గుల పోటీలు

గచ్చిబౌలి: సంక్రాంతి పండగను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మ్యాజికల్‌ చైర్స్‌, లెమన్‌ అండ్‌ స్పూన్‌ ఆటలతో మహిళలు సందడి చేశారు. ముగ్గుల పోటీలలో మేఘన, ప్రియాంక, గీతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. గెలుపొందిన వారికి ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.మంజుల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు ఆశాలత, సునీత, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్‌: మియాపూర్‌ ఎఫ్‌సీఐ కాలనీ, చందానగర్‌ భిక్షపతి ఎన్‌క్లేవ్‌కాలనీలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెర్సీ శోభ, చంద్రకళ, అసోసియేషన్‌ సభ్యులు వరలక్ష్మి, అనూష తదితరులున్నారు.

అదివో అల్లదివో..



మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్పబజార్‌, సంక్రాంతి సంబరాలలో భాగంగా గురువారం మేఘన శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో పుష్పాంజలి, వినాయకకౌతం, జనుత శబ్దం, అదివో అల్లదివో మామవతు శ్రీ సరస్వతి, భజరే గోపాలం, మూషికవాహన, , అన్నమాచార్య కీర్తన, దశావతారం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు. కాగా మేళాలో హస్తకళా ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మట్టిబొమ్మలు, మట్టిపాత్రలు, కొండపల్లి బొమ్మలు, గుజరాతి బ్యాగులు, పాలరాయి బొమ్మలు, వెదురు బుట్టలు, పెయింటింగ్స్‌ తదితరాల విక్రయాలు బాగా జరుగుతున్నాయి.

రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి



మాట్లాడుతున్న ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి

చందానగర్‌ : సర్కిల్‌ పరిధిలో ప్రధాన కూడళ్లు, రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవికుమార్‌ సూచించారు. రహదారులపై, ఖాళీ స్థలాలలో వేస్తున్న చెత్తపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. చందానగర్‌ సర్కిల్‌ -21 పరిధిలో అంబేడ్కర్‌ కల్యాణ మండపంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవికుమార్‌తో కలిసి ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి గురువారం పారిశుద్ధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ అంతర్గత కాలనీ రోడ్లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాణిజ్య కేంద్రంలో రెండు చెత్త డబ్బాలు ఉండాలని, ఇంటి వద్దనే తడి పొడి చెత్తను వేరు చేసి డంపింగ్‌ యార్డుకు తరలించే విధంగా పారిశుద్ధ్య అధికారులు చూడాలన్నారు. వారాంతపు సంతలను కాలనీ చెత్త ఆటోలకు అనుసంధానించి, సంత పూర్తి అయిన వెంటనే వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీ వాసులు, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు భాగస్వాములై చెత్తను చెత్త ఆటోలనే వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన రహదారులు శుభ్రం చేసేందుకు శేరిలింగంపల్లి జోనల్‌ నుంచి స్వీపింగ్‌ యంత్రం కేటాయింపు జరిగిందని వెంటనే ప్రధాన రహదారులను శుభ్రం చేయించాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌, ఎస్‌ఎఫ్‌ఏ, ఎస్‌ఆర్‌పి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మృగనయిని శారీ ఫెస్టివల్‌

- ఆర్ట్‌ గ్యాలరీలో ఈనెల 14వ తేదీ వరకు అందుబాటులో..
- ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు

మాదాపూర్‌: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీ ఆడిటోరియంలో మృగనయిని పేరిట మహేశ్వరీ, చందేరీ శారీ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. స్టాల్స్‌లో బ్లాక్‌ప్రింట్‌, కోసాసిల్క్‌, హ్యాండ్‌లూమ్‌ బెడ్‌ కవర్స్‌, , బాతిక్‌, బాగ్‌, కెమికల్‌ ప్రింట్‌, డ్రెస్‌ మెటీరియల్స్‌ అందుబాటులో ఉన్నాయి. ఒక్కో చీర నేయడానికి దాదాపు 15 రోజులు పడుతుందన్నారు. ప్రత్యేక డిజైన్‌లను బట్టి మరింత సమయం పడుతుందని తెలిపారు. చందేరీ చీరలు రూ. 3200 నుంచి 80వేల వరకు అందుబాటులో ఉన్నాయి.

- రా మ్యాంగో డిజైన్‌, గోల్డ్‌ బుట్టి, మీనాకారి బుట్టి, బార్డర్‌లలో కినారీ, చట్టాయ్‌ బార్డర్లు , మహేశ్వరీ చీరలు రూ. 2500 నుంచి 25,000 వేల వరకు అందుబాటులో ఉన్నాయి.
- బ్లాక్‌ ప్రింట్‌ చీరలు ప్రత్యేకం .వస్త్రాల కొనుగోలుపై 20శాతం రాయితీ ఇస్తున్నారు.









చందేరీ, మహేశ్వరీ చీరలు

మహిళలు మెచ్చే చందేరీ చీరలు

చందేరీ చీరలు ప్రత్యేకంగా తయారు చేయబడుతాయి.అన్ని తరగతుల వారికి నచ్చుతాయి. మహిళలు తమకు కావాల్సిన డిజైన్‌లను చూపిస్తే తయారు చేసి ఇస్తాము. సహజ సిద్ధమైన రంగులను మాత్రమే వాడతారు. ఇలాంటి వస్త్రాలను ధరించడం వల్ల ఆరోగ్యంగా కూడా ఉంటారు.

–అబ్దుల్‌ ఖలీద్‌, చందేరీ స్టాల్‌ నిర్వాహకుడు

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



చందానగర్‌ : పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియంలో సెయింట్‌ ఇసాక్‌ అడ్వెంట్‌ హైస్కూల్‌ ఆధ్వర్యంలో రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా స్పోర్ట్స్‌ డేను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ మహ్మద్‌ అజారుద్దీన్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకుతీయడానికి ఉపయోగపడుతుందన్నారు. క్రీడలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు రఘునాథ్‌రెడ్డి, గణేష్‌ ముదిరాజ్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, ప్రసాద్‌, అక్బర్‌ ఖాన్‌, నరేందర్‌, ప్రిన్సిపల్‌ కమర్‌ జాన్‌ ఇసాక్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేయాలి



నాయకుడు రవికుమార్‌ను కలిసిన ఆయా డివిజన్ల నూతన అధ్యక్షులు

గచ్చిబౌలి: ప్రజా సమస్యల ఎజెండాగా నూతనంగా ఎన్నికైన డివిజన్‌ అధ్యక్షులు కార్యకర్తలతో కలిసి పనిచేయాలని బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవికుమార్‌యాదవ్‌ పిలుపునిచ్చారు. గురువారం మసీద్‌బండలోని పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన డివిజన్‌ అధ్యక్షులు రవికుమార్‌ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్ఠత కోసం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మియాపూర్‌ డివిజన్‌ అధ్యక్షుడు అకుల లక్ష్మణ్‌ ముదిరాజ్‌, హఫీజ్‌పేట్‌ డివిజన్‌ అధ్యక్షుడు జితేందర్‌, ఆల్విన్‌ కాలనీ డివిజన్‌ అధ్యక్షుడు ఎత్తరి రమేష్‌, వివేకానందనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ వంశీరెడ్డి, లింగంపల్లి డివిజన్‌ అధ్యక్షుడు కిశోర్‌ ముదిరాజ్‌,గచ్చిబౌలి డివిజన్‌ అధ్యక్షుడు శివసింగ్‌, చందానగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌ రెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం...మీకు : షీ టీం

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌లో సైబరాబాద్‌ షీ టీమ్‌ బృందం గురువారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా బాలికలకు మేమున్నాం ...మీకు అంటూ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో తమకు తాము ఎలా రక్షించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, షీటీమ్‌ బృందం పాల్గొన్నారు.

రహదారి నిబంధనలను విధిగా పాటించాలి



హెచ్‌సీయూ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఏసీపీ సత్యనారాయణ, డిపో మేనేజర్‌

రాయదుర్గం: రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని ట్రాఫిక్‌ ఏసీపీ సత్యనారాయణ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో 'జాతీయ రోడ్‌ సేఫ్టీ వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపే వారు బాధ్యతాయుతంగా, ప్రశాంతంగా నడపాలన్నారు. ట్రాఫిక్‌ సమస్యలు, నిబంధనల ఉల్లంఘనలపై ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ కె రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ వీరబ్రహ్మం, డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్‌ వైవికేరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శేరిలింగంపల్లి జోన్‌ బృందం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్‌, గచ్చిబౌలి. మియాపూర్‌, చందానగర్‌ డివిజన్లలో సీసీరోడ్ల నిర్మాణానికి గురువారం ఆయన కార్పొరేటర్లు హమీద్‌పటేల్‌, గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటిశ్రీకాంత్‌, మంజులరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వసతులు కల్పనకు దశలవారీగా చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లను సీసీరోడ్లు, ప్రధాన రోడ్లను బీటీరోడ్లుగా మారుస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పనులను చేపట్టేందుకు తగిన ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉర్దూ భారతదేశ భాషే

అలీఘడ్‌ ముస్లిం యూనివర్సిటీ వీసీ ప్రొ.తారీఖ్‌మన్సూర్‌



రాయదుర్గం: ఉర్దూ భారతదేశ భాష అని అలీఘడ్‌ ముస్లిం యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ తారీఖ్‌ మన్సూర్‌ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం 28వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాష ఇండో–ఆర్యన్‌ భాష అని భారతదేశంలోని 23 జాతీయ భాషలలో ఒకటని, 170 మిలియన్లకు పైగా ప్రజలు మాట్లాడే భాష అని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో సాగాలన్నారు. ×మనూ౯ చాన్స్‌లర్‌ ముంతాజ్‌ అలీ మాట్లాడుతూ మౌలానా ఆజాద్‌ కేవలం మతపరమైన వ్యక్తి కాదని, సమకాలీన శాస్త్రాలకు మద్దతుదారని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ ఛాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌హసన్‌, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఇష్తియాక్‌ అహ్మద్‌, సయ్యద్‌ ముస్తాఫా కమల్‌, నసీమా తురబుల హసన్‌, పద్మశ్రీ మహ్మద్‌ అలీ బేగ్‌,డాక్టర్‌ అబ్దుల్‌ ఖదీర్‌, అషర్‌ఫర్హాన్‌, తఖీఅలీఖాన్‌ ప్రసంగించారు.

బాత్‌రూమ్‌లో కిందపడి వ్యక్తి మృతి

మియాపూర్‌: బాత్‌రూమ్‌లో కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ప్రకాశం జిల్లా మూటూరు గ్రామానికి చెందిన బొల్లపల్లి శ్రీకాంత్‌(40) సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌. మియాపూర్‌ హఫీజ్‌పేటలోని హైటెక్‌ హాస్టల్‌లో ఉంటున్నాడు. వారానికి ఒకరోజు ఆఫీస్‌కు వెళ్లి వచ్చేవాడు. గత మూడు రోజుల నుండి శ్రీకాంత్‌ హాస్టల్‌లో మద్యం తాగుతూ ఉన్నాడు. ఈ క్రమంలో హాస్టల్‌ సిబ్బంది గురువారం ఉదయం బాత్‌రూమ్‌లో శ్రీకాంత్‌ పడి ఉండడం చూసి యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. దీంతో హాస్టల్‌ యాజమాని వచ్చిచూసి 108 అంబులెన్స్‌కు కాల్‌ చేయగా వారు పరీక్షించి శ్రీకాంత్‌ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మియాపూర్‌ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. శ్రీకాంత్‌ మృతి చెందినట్లు తల్లి పద్మకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యకు గురైన వ్యక్తి మహారాష్ట్రవాసిగా గుర్తింపు

మియాపూర్‌: మియాపూర్‌ హఫీజ్‌పేట్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో హత్యకు గురైన వ్యక్తి మహారాష్ట్రవాసిగా మియాపూర్‌ పోలీసులు గుర్తించారు. ఆదివారం హఫీజ్‌పేట్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో ఓ వ్యక్తిని సిమెంట్‌ ఇటుకతో తలపై కొట్టి హత్యచేసిన విషయం తెలిసిందే. పోలీసుల దర్యాప్తులో భాగంగా మహారాష్ట్రలోని బీడ్‌ జిల్లా దారూర్‌ తాలుకా సరూక్‌వాడి గ్రామానికి చెందిన కేశవ్‌ బంగార్‌(39)గా గుర్తించారు. కేశవ్‌ బంగార్‌ కొంతకాలం క్రితం హఫీజ్‌పేట్‌కు వచ్చి స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. కేశవ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు సిమెంట్‌ ఇటుకతో తలపై మోది హత్య చేసి పరారయ్యారు. మియాపూర్‌ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్‌ ఏఈ ఎస్‌.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంజయ్యనగర్‌, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొండాపూర్‌, కియా షోరూం తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో.. విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- శ్రీలీలా ఫీడర్‌ పరిధిలో.. శ్రీలీలా విల్లాస్‌, కల్వరి చర్చి, వాటర్‌ వర్క్స్‌, అపర్ణ విల్లాస్‌ ప్రాంతాలలో..
- మాతృశ్రీనగర్‌ ఫీడర్‌ పరిధిలో.. ఆల్విన్‌ కాలనీ క్రాస్‌ రోడ్స్‌, జనప్రియ నగర్‌ ఫేజ్‌ 1,2,3,4,5,6, భాను టౌన్‌షిప్‌, కుమ్మరి బస్తీ, ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

నేడు భవిష్యనిధి అదాలత్‌

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్‌ ఫండ్‌ (పీఎఫ్‌) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్‌ నిర్వహించనున్నట్లు పీఎఫ్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్‌ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులోని పీఎఫ్‌ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్‌, బీహెచ్‌ఇఎల్‌ ఖాతాదారులు పాల్గొనాలన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

మూసాపేట: సంక్రాంతికి ప్రత్యేక ఆర్‌టీసీ బస్సులు నడిపిస్తున్నామని కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిప్యూటి ఆర్‌ఎం కవిత అన్నారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమారు 80 ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నామని 10వ తేదీ వరకు రిజర్వేషన్లు చేసుకున్నారని తెలిపారు. బీహెచ్‌ఇఎల్‌, మియాపూర్‌, కేపీహెచ్‌బీ, ఎస్‌ఆర్‌నగర్‌, అమీర్‌పేటలలో పాయింట్లు ఉంటాయని, ఖమ్మం, విజయవాడ, సత్తుపల్లి, వరంగల్‌, రాజమండ్రి వంటి ప్రాంతాలకు బస్సులు ఉన్నాయన్నారు. ప్రత్యేక బస్సుల్లో మహాలక్ష్మీ టిక్కెట్లు వర్తించవని తెలిపారు. బుకింగ్‌ లేని బస్సుల్లో మహాలక్ష్మి టిక్కెట్లు తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకు వర్తిస్తాయని వివరించారు. 11వ తేదీ నుంచి బస్సులు పెంచే అవకాశం ఉందని చెప్పారు.

'ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు'

మాదాపూర్‌: రోడ్లపై వాహనదారులను, ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా సైగలు, పాటలు పాడడం, దృష్టిని మరలించే ప్రయత్నం చేయవద్దని మాదాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ కృష్ణమోహన్‌ హెచ్చరించారు.గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లకు పలు సూచనలు చేశారు. అసభ్యకరమైన సైగలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంతరాయం కలిగించేలా కూడళ్లలో సంచరించరాదని తెలిపారు. సమావేశంలో దాదాపు 25 మంది ట్రాన్స్‌జెండర్స్‌ పాల్గొన్నారు.